## క్లుప్తంగా

### ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు నేడు చివరి తేదీ

**ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి**

**చేవెళ్ల:** ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకునేందుకు నేడు చివరి తేదీ అని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వతరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 22వ తేదీ చివరి తేదీ అని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. కావునా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకొని వారు వెంటనే చేసుకోవాలని సూచించారు.

### కోటి సంతకాల సేకరణ



లాలపేటలో సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

**కొందుర్గు:** బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా తలపెట్టిన కోటి సంతకాల సేకరణ మంగళవారం ఆ పార్టీ నాయకులు కొందుర్గు మండలంలోని లాలపేటలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రశాంత్ హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు అధికారంలో ఉన్న అగ్రవర్ణ పార్టీలు బీసీలను అడుక్కుతినే స్థాయికి తెచ్చారని అన్నారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొని బహుజన పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బీసీల బతుకులు మారుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసు, ఉదయ్ కృష్ణ, నర్సింలు పాల్గొన్నారు.

### మరకత శివలింగానికి పూజలు చేయడం అదృష్టం

**టీవీ సీరియల్ నటి రూపారెడ్డి**



నటి రూపారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

**శంకర్‌పల్లి:** మరకత శివ లింగానికి పూజలు చేయడం పూర్వజన్మ శుకృతమని కల్యాణం కమనీయం టీవీ సీరియల్ నటి రూపారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండలంలోని చెందిప్ప గ్రామంలోని మరకత శివాలయంలో ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పచ్చని పంట పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో శివాలయం ఉందని పేర్కొన్నారు. కాగా, చరిత్ర కల్గిన దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



పూజలు చేస్తున్న పూజారులు

**మొయినాబాద్:** మండల పరిధిలోని సురంగల్‌లో కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్ద చెరువు కట్టపై పునర్నిర్మించిన కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు పూజలు మొదలు పెట్టారు. మొదటి రోజు కట్టమైసమ్మ అమ్మవారి జీర్ణోదారణ, వాస్తుబలి, వాస్తుహోమం, పూజలు నిర్వహించారు. ఆచార్య పవన్ కుమార్ శర్మ చేతులమీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో సర్పంచ్ గడ్డం లావణ్య, మాజీ ఉపసర్పంచ్ గడ్డం అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహ్మారెడ్డి, మల్లేష్‌గౌడ్, ఇతర నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### పాఠశాలకు బోర్డులు బహూకరణ



చిన్నారులకు పలకలను పంపిణీ చేస్తున్న సభ్యులు

**కేశంపేట:** మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి జ్ఞాపకార్థం బోర్డులను, మర్కర్లను వారి కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు. అలాగే, గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పలకలను, బోర్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిర్ర శ్రీను, మాధవులు, కుమార్, ఆనంద్ రెడ్డి, భారతమ్మ, శ్రావణి పాల్గొన్నారు.

# బడి గోడలే.. విజ్ఞాన వీచికలు

- ఆదర్శంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
- తరగతి గదుల గోడలపై వివిధ చిత్రపటాల పెయింటింగ్
- విద్యార్థుల్లో పెరుగుతున్న పఠనాసక్తి

**షాబాద్:** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ పాఠశాల ఉపాధ్యాయుడు చదువుతో పాటు విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. మరో పక్క ఆణిముత్యంలాంటి సూక్తులు వారిని ప్రభావితం చేస్తున్నాయి. గోడలపై చిత్రపటాలు వేయడం వల్ల చరిత్ర తెలుసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. తెలుగు, ఆంగ్లం ,సామాన్యశాస్త్రాలకు సంబంధించి బొమ్మలు ముఖ్యమైన అంశాలను గోడలపై అంటించడం వల్ల విద్యార్థులకు బడి అంటే ఆసక్తి కలిగిస్తున్నాయి. చదువులో రాణిస్తున్నారు. టీఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో తయారు చేసిన పరికరాలపై విద్యాబోధన చేస్తున్నామన్నారు.



పాఠశాల గోడలపై వేసిన పిల్లల ఆట బొమ్మలు

**చరిత్ర నుంచి వ్యాకరణం వరకు...**

దేశ చరిత్ర, స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాలు, సౌర కుటుంబం, ఊపిరితిత్తుల నిర్మాణం, గణితంలో ముఖ్యమైన సూత్రాలు తెలుగు వ్యాకరణం, తదితర అంశాలను గోడలపై వేశారు. పాఠశాల తరగతి గదులలో ఎక్కడ చూసినా రకరకాల చిత్రాలు, పాఠ్యాంశాలే కనిపిస్తాయి. రాష్ట్రాలు, రాజధానులు, జాతీయ చిహ్నాలు తదితర వివరాలను గోడలపై వ్రాసి విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నారు. రాయించిన సూక్తులను పదేపదే చదివించడం వల్ల విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



వెంకమ్మగూడ పాఠశాల

**బొమ్మలతో బోధన బాగుంది**



గోడలపై పెయింటింగ్‌లతో బోధన భలేగా ఉంది. బొమ్మలను చూయిస్తూ పాఠాలు చెబుతున్నారు. బొమ్మలను చూపెట్టి అది ఏ బొమ్మో చెప్పమంటారు. దీంతో మాకు బొమ్మ చూడినప్పుడే సగం పాఠం చక్కగా అర్థమవుతోంది. మిగతా సగానికి సంబంధించి సార్‌లు వివరిస్తున్నారు. పాఠాలపై ఆసక్తి కలిగి చక్కగా చదువుకుంటున్నాం.

– కరుణాకర్, 5వ తరగతి, ప్రాథమిక పాఠశాల వెంకమ్మగూడ

**ఇష్టంగా నేర్చుకుంటున్నాం**



మొదట స్కూల్‌కు వెళ్లి చదువుకోవాలంటే భయంగా ఉండేది. బడిగోడలపై చిత్రాలను చూపెడుతూ పాఠాలు చెప్పడంతో మాకు బడి అంటే ఇష్టంగా మారింది. చిత్రాలతో బోధన మహానందంగా ఉంది. ఆడుతూ, పాడుతూ పాఠాలను చక్కగా నేర్చుకుంటున్నాం.

– శృతి, 4వ తరగతి, ప్రాథమిక పాఠశాల వెంకమ్మగూడ

**విద్యార్థుల్లో పఠనాసక్తి పెరిగింది**



గోడలపై ఉన్న సూక్తులు, వ్యాకరణం, గణితం సూత్రాలు విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేందుకు దోహదపడతాయి. తరగతి గదిలో బోధించిన పాఠాలను చిత్రాల రూపంలో చూపిస్తుండడంతో త్వరగా అర్థమవుతున్నాయి. విద్యార్థుల్లో పఠనాశక్తి మెరుగు పర్చేందుకు గోడలపై చిత్రాలు దోహదపడుతున్నాయి.

– సింహాద్రి నాయుడు, ప్రధానోపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాల వెంకమ్మగూడ

## పాడి పశువులతో ఆర్థికాభివృద్ధి

**పశువైద్య అధికారి దేవిరెడ్డి**

**మొయినాబాద్‌రూరల్:** పాడి పశువులను ఆరోగ్యంగా కాపాడుకున్నప్పుడే పెంపకందారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పశువైద్య అధికారి దేవిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు, లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసి గర్భకోశ వ్యాధులకు వైద్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి పశువులు, లేగదూడలను ఈ వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సూచించారు. విర్బాక్ మందులు కంపెనీ వారు పాల్గొని ఉచితంగా పశువుల అభివృద్ధి కోసం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ పద్మ, ఎల్ఎస్ఏ కుమార్, వీఏ భీమా, శివ, ఓఎస్ రవి, గోపాలమిత్ర రైతులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి దేవిరెడ్డి

**నేటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ**

ఈ నెల 22వ తేదీ(బుధవారం) నుంచి 28వ తేదీ వరకు జీవాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో తేదీల వారీగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని పశువైద్య అధికారి దేవిరెడ్డి తెలిపారు.

## ప్రత్యేక బస్సు నడపాలని నిరసన



మాట్లాడుతున్న అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, సుబ్రహ్మణ్యం

**అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం**

**షాబాద్:** మండలంలోని మోడల్ స్కూల్ వరకు ప్రత్యేక బస్సులు నడపాలని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే వివిధ గ్రామాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు షాబాద్ బస్టాండ్ నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యలను పరిష్కరించాలని అంబేడ్కర్ ప్రజా సంఘం తరపున డిమాండ్ చేశారు. బస్టాండ్ నుంచి మోడల్ స్కూల్ వరకు విద్యార్థుల కోసం పాఠశాల సమయానికి ఉదయం , సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెడీ రమేష్, కార్యదర్శి వెంకటేష్, మండల కార్యదర్శి ఆనంద్, జాయింట్ సెక్రటరీలు యాదయ్య, నర్సింహులు, నాయకులు అంజయ్య, శివకుమార్, సత్తయ్య, రాంచంద్రయ్య ఉన్నారు.

## మాతృభాషను కాపాడడం అందరి బాధ్యత

**ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా**

**షాద్‌నగర్‌రూరల్:** అమ్మలాంటి మాతృభాషను ఆదరించి పరభాష వ్యామోహాన్ని విడనాడుదామని క్రిష్ణవేణి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా అన్నారు. మంగళవారం పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీలోని క్రిష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం రఫత్‌సుల్తానా మాట్లాడుతూ.. దేశ భాషలందు తెలుగు లెస్స, అలాంటి మధురమైన మన మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేశ భాషల్లో మన తెలుగు భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని చెప్పారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న నాయకులు, తదితరులు

**జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్**

**నందిగామ:** దైవచింతనతో మానసిక ప్రశాంతత పొందుతారని జెడ్పీవైస్ చైర్మన్ గణేష్ అన్నారు. మండల పరిధిలోని వెంకమ్మగూడలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి (బండమీది జాతర) దేవాలయాన్ని ఎంపీపీలు రవీందర్ యాదవ్, ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, ప్రియాంక తదితరులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బండమీది జాతర నిర్వహించడం ఆనవాయితీ. పెద్ద ఎత్తున జాతర నిర్వహించడంపై నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ పద్మారావు, మాజీ మార్కెట్ క మిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మ న్ విఠల్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, సర్పంచులు రజనీత, సంతోష, కుమార్, అశోక్ పాల్గొన్నారు.

## చెన్నకేశవరెడ్డిని గెలిపించండి

**పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి**

**నందిగామ:** రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థిగా పోటీలో ఉన్న చెన్నకేశవరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మామిడిపల్లి, నర్సప్పగూడ, చేగూరు, మేకగూడ, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ప్రచారానికి ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెలలో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఆ కార్యక్రమానికి టీచర్లందరూ హైదరాబాద్‌లోని నాంపల్లికి తరలిరావాలని కోరారు. టీచర్లు గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే చెన్నకేశవ రెడ్డికి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి ప్రభాస్, గౌరవ అధ్యక్షుడు రమేష్ ఉపాధ్యాయులు విద్యాసాగర్, ఆంజనేయులు,జంగయ్య, సోంభూపాల్ రెడ్డి, కమలేష్, ధనుంజయ్, భరత్ భూషన్, బాబు రావు, నరేందర్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్టీయూ నాయకులు

### మంత్రి కేటీఆర్‌ను కలిసిన సర్పంచ్ శ్రీనివాస్



మంత్రి కేటీఆర్‌తో సర్పంచ్ శ్రీనివాస్

**శంకర్‌పల్లి:** మండలంలోని గోపులారం గ్రామ సర్పంచ్ మంగళవారం నగరంలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మొయినాబాద్ మండలం– శంకర్‌పల్లి మండలాల మధ్య రాకపోకల కోసం గోపులారం గ్రామం వద్ద మూసీవాగు వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎంతో కృషి మరువలేనిదన్నారు. కాగా, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

### నిరుపేదలకు అండగా సీపీఐ

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి**



మాట్లాడుతున్న సీపీఐ నేత రామస్వామి

**చేవెళ్ల:** ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవాడికి పట్టాలు ఇవ్వాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం భూపోరాటంలో భాగంగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఎనిమిదవ రోజు మద్దతు తెలిపారు. ధనవంతులు, భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను అక్రమించి దర్జాగా అనుభవిస్తుంటే ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పేదలకు 60 గజాల స్థలాన్ని ఇవ్వాలని ప్రభుత్వానికి వినతులు ఇచ్చిన ఫలితం లేకపోవడంతోనే పేదలు విసుగు చెందిన సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటాలకు సిద్ధమైనట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంజయ్య, ప్రభులింగం, సత్తిరెడ్డి, సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, మక్బూల్, మల్లేశ్, మంజుల, మాధవి, విజయమ్మ, అనసూయ, సాయిలమ్మ ఉన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తత

**సీఐ గురువయ్యాగౌడ్**

**షాబాద్:** వినూత్న రీతిలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ గురువయ్యాగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల పట్ల, ట్రాఫిక్‌రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...5జీ సేవలు అందుబాటులోకి రావడంతో సైబర్ మోసగాళ్ల పట్ల విద్యార్థులు, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసగాళ్లు అమాయకుల ఖాతాలు కొల్లగొట్టేందుకు ఏ అవకాశాన్ని వదలడం లేదన్నారు. ఫోన్ చేసి లేదా మేసేజ్ పంపి ఓటీపీ చెప్పమని అడిగితే తొందరపడి క్లిక్ చేయొద్దని తెలిపారు. ఇదే అదునుగా తీసుకొని సైబర్ నేర గాళ్లు బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎల్. నర్సింహులు, ఎస్ఐలు సత్యం, మహేశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ గురువయ్యాగౌడ్

## డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు, నాయకులు

**షాద్‌నగర్:** విద్యార్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాల భవనం పూర్తయింది. కళాశాలలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రభుత్వం నుంచి రూ.1కోటి 55 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ, మరుగుదొడ్లు, అత్యాధునిక హంగులతో ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారు.

**నిధుల మంజూరు పట్ల హర్షం**

ఎమ్మెల్యే కళాశాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించినందుకు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ చెట్ల పావని, పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యేను సన్మానించారు. కళాశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించడం పట్ల కళాశాల అధ్యాపకులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, కౌన్సిలర్ నర్సింహ్మా, నాయకులు వంకాయల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం

**కొందుర్గు:** గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన నమో మాతృమూర్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, బైరంపల్లి, టేకులపల్లి గ్రామాల్లో గర్భిణుల, బాలింతలకు ప్రోటీన్, విటమిన్ పౌడర్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లులు బాగుంటేనే భవిష్యత్ తరం బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, ప్రదీప్, అశోక్, శ్యామ్‌సుందర్ రెడ్డి, గణేష్, సుభాష్ రెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీల అమలులో విఫలం



రైతులతో మాట్లాడుతున్న శంకర్

**కాంగ్రెస్ నాయకుడు వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్‌రూరల్:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ ప్రశ్నించారు. హామీలను విస్మరించిన నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉమ్మడి కంసాన్‌పల్లి, భీమారం గ్రామాల్లో మంగళవారం హాత్‌సేహాత్ జోడో పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లిశంకర్ ఆయా గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అధికార దాహంతో ప్రజలకు అమలు కాని హామీలను ఇచ్చి ఓట్లు దండుకొని గద్దెనెక్కాక హామీలను విస్మరించారని విమర్శించారు. గత తొమ్మిదేళ్ల పాలనలో ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు కూలీల, హరిజన, గిరిజనుల, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్సీ సెల్, ఎస్టీసెల్, మైనార్టీ సెల్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం అభినందనీయం

**వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి**

**చేవెళ్ల:** ప్రతి ఒక్కరు ప్రజలకు ఏదో రకంగా సేవ చేస్తుండాలని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి శివరాత్రి జాతర సందర్భంగా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, ఆయన కుమారులు యాదగిరిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక సేవ కార్యక్రమాలు చేస్తూ పది మందికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, దామరగిద్ద సర్పంచ్ వెంకటేశంగుప్తా, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు మాణిక్యరెడ్డి, బేగరి నర్సింలు, నాయకులు మద్దెల జంగయ్య, మానిక్యం, నాగరాజు, ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న సునీతారెడ్డి, కెఎస్.రత్నం